తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం - 16- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 42 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


# అమెజాన్‌తో తెలంగాణకు భారీ పెట్టుబడి



- భారత్ ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్
- 2034 లక్ష్యాలకు తొలి అడుగు
- లక్ష కోట్ల పెట్టుబడులకు సీఎం పిలుపు




హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణను 2034 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్‌కు మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దే సంకల్పానికి ఈ డేటా సెంటర్ తొలి అడుగుగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శంకుస్థాపన అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ముఖ్యమంత్రి, దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు ఈ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు, ప్రపంచస్థాయి సంస్థల పెట్టుబడులకు మార్గం సుగమం చేస్తుందని అన్నారు.

మిగతా 2లో

# అంగన్‌వాడీలపై సీతక్క సమీక్ష

- 'తొలిముద్ద' అమలుకు ఆదేశాలు
- గుడ్లు, పప్పు సరఫరాపై ప్రత్యేక దృష్టి
- సంక్షేమ పథకాల అమలు వేగవంతం

హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):

మహిళా, శిశు సంక్షేమ పథకాల అమలుపై రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క సచివాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో అమలవుతున్న మహిళా, శిశు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పరిశీలించిన మంత్రి, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీల్లో అమలవుతున్న 'తొలిముద్ద' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో నాణ్యమైన సేవలు అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు, పప్పు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఇంటికి తీసుకెళ్లే పోషకాహార పంపిణీని వేగవంతం చేసి అర్హులందరికీ సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

మిగతా 2లో



# చిన్న రైస్ మిల్లర్లకు అండగా ఉంటాం

ప్రభుత్వంపై కవిత ఆరోపణలు

బకాయిల్లో వివక్ష చూపుతున్నారని విమర్శ

వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితను రాష్ట్రంలోని రా రైస్ మిల్లర్ల ప్రతినిధులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, చిన్న రైస్ మిల్లర్లకు తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం పెద్ద రైస్ మిల్లర్ల విషయంలో ఒక విధంగా, చిన్న మిల్లర్ల విషయంలో మరో విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో వందల కోట్ల రూపాయల వ్యాపారం చేసే పెద్ద రైస్ మిల్లర్లకు ప్రభుత్వానికి దాదాపు రూ.4 వేల కోట్ల బకాయిలు ఉన్నప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కవిత విమర్శించారు. కానీ రూ.10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు బకాయిలు ఉన్న చిన్న రైస్ మిల్లర్లపై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. చిన్న మిల్లర్లను నేరస్థులుగా చూడటం సరికాదని అన్నారు.



మిగతా 2లో

# కేంద్రంపై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు

- పోటీ పరీక్షలపై ఆందోళన వ్యక్తం
- విద్యార్థులు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపు

హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):

దేశంలో విద్యా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వ్యాపారంగా మార్చిందని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. హైదరాబాద్ బోయిన్‌పల్లిలో నిర్వహించిన "ఛత్రోంకి గూంజ్" కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యే శ్రీ గణేష్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాల్సిన అవసరం ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా విద్యను వ్యాపార దృక్పథంతో చూస్తోందని విమర్శించారు. విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో యువత తీవ్ర ఆందోళనలో ఉందని పేర్కొన్నారు.
ఉద్యోగ, విద్యా పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు తరచూ లీక్ కావడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు, యువత జీవితాలు దెబ్బతింటున్నాయని కార్యక్రమంలో నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసం దెబ్బతింటోందని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై పలు ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయన రాజీనామా చేయకపోవడం, కేంద్ర ప్రభుత్వం కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.
విద్యార్థుల హక్కులను కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే ఈ కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారని నాయకులు తెలిపారు. విద్య, ఉద్యోగాల అంశాల్లో యువతకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ ఉద్యమంలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడంతో పాటు పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకతను నిర్ధారించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# ప్రభుత్వ పాఠశాలలో విజ్ఞాన కేంద్రం



విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథమే లక్ష్యం

అల్వాల్‌లో కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

మల్కాజిగిరి, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):
మల్కాజిగిరిలోని అల్వాల్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన విజ్ఞాన కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని మరింత చేరువ చేయడంతో పాటు పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. చిన్న వయసు నుంచే విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రయోగాలు చేయడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు.

మిగతా 2లో

# మెట్రో విస్తరణపై కాంగ్రెస్, బీజేపీని విమర్శించిన కేటీఆర్



- హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపణ
- ప్రాజెక్టులపై ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్

హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశంలో బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒకే విధంగా వ్యవహరించాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నగరాభివృద్ధికి కీలకమైన మెట్రో విస్తరణ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో ఇరు పార్టీలు

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అమెజాన్‌తో తెలంగాణకు భారీ పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

ఫార్చ్యూన్-500 సంస్థలను భారత్ ఫ్యూచర్ సిటీకి ఆకర్షించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు 108 దేశాల ప్రతినిధులు, మూడు వేలకుపైగా కార్పొరేట్ సంస్థలను ఆహ్వానించడం కూడా అదే లక్ష్యంలో భాగమని వివరించారు.

2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. దేశ జనాభాలో కేవలం 2.5 శాతం మాత్రమే ఉన్న తెలంగాణ ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తికి ఐదు శాతం మేర వాటా అందిస్తోందని, దానిని 2047 నాటికి పది శాతానికి పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఇందుకోసం పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంచేందుకు సింగిల్ విండో విధానంలో అన్ని అనుమతులు




మంజూరు చేస్తున్నామని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అమెజాన్ వచ్చే 14 ఏళ్లలో రాష్ట్రంలో ఏడు బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. అదే తరహాలో 2034 నాటికి అమెజాన్ తెలంగాణలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలని కోరారు. పెట్టుబడులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని, ప్రతి నెలా పెట్టుబడుల పురోగతిని స్వయంగా సమీక్షిస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం పర్యాటకం, వైద్యం, క్రీడలు, పరిశ్రమల రంగాలకు ప్రత్యేక విధానాలను రూపొందించామని ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత మహానగరంగా తీర్చిదిద్దేందుకు కాలుష్య పరిశ్రమలను నగర శివార్లకు తరలిస్తున్నామని, మూసీ నది ప్రక్షాళన చేపట్టామని చెప్పారు. డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నామని, విద్యుత్ వాహనాలకు ప్రోత్సాహకంగా పన్ను మినహాయింపు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి దృష్ట్యా రాష్ట్రాన్ని మూడు అభివృద్ధి మండలాలుగా విభజించి కార్యాచరణ రూపొందించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాన్ని సేవారంగానికి, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని తయారీ పరిశ్రమలకు, బయటి ప్రాంతాన్ని వ్యవసాయ ఆధారిత అభివృద్ధికి కేటాయిస్తున్నామని వివరించారు. విద్యుత్, నీరు, భూమి, నైపుణ్యం కలిగిన యువశక్తితో తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని, అభివృద్ధి కోసం భూములు ఇస్తున్న రైతుల త్యాగాన్ని ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, వారికి మరింత నష్టపరిహారం, భరోసా కల్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# అంగన్‌వాడీలపై సీతక్క సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

పోషకాహార లోపం నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. పనులు ఆలస్యం కాకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులకు అనుకూలమైన వాతావరణంలో సేవలు అందించేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు అధిక సంఖ్యలో హాజరయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. ఇందుకోసం గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. పథకాల అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా పని చేయాలని, ప్రతి అర్హ లబ్ధిదారునికి ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.



# చిన్న రైస్ మిల్లర్లకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కవిత ఆరోపించారు. తరుగు పేరుతో రైతుల నుంచి 8 నుంచి 10 కిలోల వరకు ధాన్యం తగ్గించి వేల కోట్ల రూపాయల అవకతవకలు జరిగాయని విమర్శించారు. చిన్న రైస్ మిల్లర్లపై చర్యల కారణంగా వారు గోదాముల అద్దెలు, వడ్డీ భారం భరించాల్సి వచ్చిందని, కరీంనగర్‌లో ఓ మహిళ ఆత్మహత్యకు కూడా ఈ పరిస్థితులే కారణమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న దొడ్డు బియ్యాన్ని విదేశాలకు అధిక ధరకు విక్రయించారని, ప్రస్తుతం మాత్రం తక్కువ ధరకు విక్రయించే ప్రయత్నం జరుగుతోందని కవిత ఆరోపించారు. దీనికి సంబంధించిన టెండర్లలో కూడా అవకతవకలు జరిగాయని, ఈ అంశంపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ బియ్యం తరలింపులు జరిగాయని అన్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పెద్ద రైస్ మిల్లర్ల అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, చిన్న మిల్లర్లనే లక్ష్యంగా చేసుకుంటోందని కవిత విమర్శించారు. చిన్న రైస్ మిల్లర్లకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం కల్పించాలని,



పెద్ద మిల్లర్లకు ఇచ్చిన షరతులనే చిన్న మిల్లర్లకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించి ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో రైస్ మిల్లింగ్ వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని కవిత డిమాండ్ చేశారు. పెద్ద, చిన్న మిల్లర్ల విషయంలో సమాన న్యాయం పాటించాలని, రైతులు, చిన్న రైస్ మిల్లర్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. చిన్న రైస్ మిల్లర్ల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# మెట్రో విస్తరణపై కాంగ్రెస్, బీజేపీని విమర్శించిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా ఆయన స్పందించారు. లక్డీకాపూల్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు మెట్రో మార్గానికి అనుమతులు కోరినప్పుడు, ప్రయాణికులు ఉండరనే కారణంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని కేటీఆర్ ఆరోపించారు. దీంతో నగర ప్రజలకు అవసరమైన కీలక మెట్రో విస్తరణ ఆలస్యమైందని పేర్కొన్నారు.

కేంద్ర అనుమతులతో సంబంధం లేకుండా విమానాశ్రయం మెట్రో ప్రాజెక్టుకు గతంలో టెండర్లు పిలిచి పనులు ముందుకు తీసుకెళ్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని రద్దు చేసిందని విమర్శించారు. దీంతో నగర ప్రజలకు ఉపయోగపడే మరో కీలక ప్రాజెక్టు నిలిచిపోయిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో 70 కిలోమీటర్ల మెట్రో రైలు మార్గాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే గత రెండున్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త మెట్రో ప్రాజెక్టుల విషయంలో ఎలాంటి పురోగతి సాధించలేదని ఆరోపించారు.

నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెట్రో విస్తరణ పనులను వేగవంతం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసే ప్రాజెక్టుల విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుని హైదరాబాద్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.




# ప్రభుత్వ పాఠశాలలో విజ్ఞాన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

ఇటువంటి విజ్ఞాన కేంద్రాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విజ్ఞాన కేంద్రం ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలను నేర్చుకునే అవకాశాలు మరింత పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, విజయేంద్ర ప్రసాద్, ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ ప్రధాన కార్యదర్శి జయప్రకాశ్ నారాయణ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు సహకరించిన సంస్థ ప్రతినిధులను అభినందిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన అతిథులు అక్కడ ఏర్పాటు చేసిన పరికరాలు, విద్యా నమూనాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆసక్తులను తెలుసుకున్నారు. విజ్ఞానాన్ని అన్వేషించే తపనతో ముందుకు సాగాలని, ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారికి సూచించారు. ఈ కేంద్రం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత, పరిశోధనా నైపుణ్యాలు మరింత పెంపొందుతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విద్యాసంస్థలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# డంప్‌యార్డుపై పోరాటం ఉధృతం

- **ఈటలను కలిసిన అఖిలపక్ష నేతలు**
- **బాధితులకు అండగా ఉంటానన్న ఎంపీ**
- **పార్లమెంట్‌లో సమస్య ప్రస్తావన హామీ**

**శామీర్‌పేట్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

జవహర్‌నగర్ డంప్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం కోరుతూ అఖిలపక్ష నాయకులు, సంయుక్త చర్యా సమితి ప్రతినిధులు, స్థానిక ప్రజలు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను శామీర్‌పేట్‌లోని ఆయన శిబిర కార్యాలయంలో కలిశారు. డంప్‌యార్డుకు వ్యతిరేకంగా రెండు దశాబ్దాలుగా సాగుతున్న ఉద్యమానికి రాజకీయాలకు అతీతంగా నాయకత్వం వహించాలని కోరారు. ఇరవై ఏళ్లుగా చెత్త కుప్పలు, కాలుష్యంతో నరకయాతన అనుభవిస్తున్నామని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల డంప్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల సందర్భంగా ఉద్యమకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో ఈటల రాజేందర్ స్వయంగా వచ్చి మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు. తమ కష్టకాలంలో అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డంప్‌యార్డును





తరలిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని నాయకులు ఆరోపించారు. జవహర్‌నగర్ ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యత ఇప్పుడు ఎంపీ ఈటలపై ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వారి వినతిపై స్పందించిన ఈటల రాజేందర్ జవహర్‌నగర్ డంప్‌యార్డు బాధితుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఒక్కటై పోరాడటం అభినందనీయమని పేర్కొన్నారు. డంప్‌యార్డు పరిసరాల్లో నివసిస్తున్న వారు ఎక్కువగా నిరుపేద కుటుంబాలకు చెందినవారేనని, వారి ఆరోగ్యంతో ప్రభుత్వం ఆటలాడకూడదని అన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజల వెంటే నిలిచి ఉద్యమానికి నాయకత్వం వహిస్తానని భరోసా ఇచ్చారు. డంప్‌యార్డు సమస్యపై గతంలో ముఖ్యమంత్రితో పాటు మున్సిపల్ అధికారులతో పలుమార్లు మాట్లాడినట్లు ఈటల తెలిపారు. గతంలో కుదిరిన ఒప్పందాలను అమలు చేయాలని కోరినా అధికారులు, పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. ఫలితంగా జవహర్‌నగర్ పరిసర ప్రాంతాలు తీవ్ర కాలుష్యానికి గురై విషవలయంగా మారాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరసనలు తెలిపిన వారిపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం సరైన విధానం కాదని అన్నారు.

ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న తనపై గతంలో వందలాది కేసులు నమోదు చేశారని, అలాంటి బెదిరింపులకు తాను భయపడబోనని ఈటల స్పష్టం చేశారు. అయితే ఉద్యమం శాంతియుతంగా కొనసాగాలని, ప్రభుత్వ ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ప్రజాశక్తి ముందు ఎవరైనా తలవంచాల్సిందేనని, భయపడాల్సిన అవసరం లేదని ఉద్యమకారులకు ధైర్యం చెప్పారు. జవహర్‌నగర్ ప్రజల సమస్యను దేశ రాజధానిలో వినిపిస్తానని, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో డంప్‌యార్డు అంశాన్ని ప్రస్తావిస్తానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. డంప్‌యార్డును పూర్తిగా తరలించి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు పోరాటం ఆపబోనని, ప్రజల్లో ఒకడిగా ఉంటూ వారికి అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

# ఏసీబీ వలలో భూగర్భ జలాల అధికారి

- **రూ.20 వేల లంచం తీసుకుంటూ పట్టివేత**
- **ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో కలిసి అరెస్టు**

**హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

సూర్యాపేట జిల్లా భూగర్భ జలాల శాఖలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన వలలో జిల్లా భూగర్భ జలాల అధికారి మేఘావత్ బాలు, ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోసనోజు వెంకటేశ్వర్లు చిక్కారు. బోరు బావి తవ్వకాలకు అధికారిక అనుమతి మంజూరు చేయడం, అలాగే రిగ్‌ను స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.20 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఏసీబీ వివరాల ప్రకారం, జిల్లా భూగర్భ జలాల అధికారి మేఘావత్ బాలు తన తరఫున ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోసనోజు వెంకటేశ్వర్లుతో ఫిర్యాదుదారుడి నుంచి లంచం తీసుకునే ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో కోసనోజు వెంకటేశ్వర్లు రూ.20 వేల నగదును స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి నగదుతో పాటు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రధాన నిందితుడు మేఘావత్ బాలును కూడా అరెస్టు చేశారు.

లంచంగా తీసుకున్న రూ.20 వేల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరు నిందితుల అధికారిక విధుల నిర్వహణలో అవకతవకలు జరిగాయా అనే కోణంలో వారి కార్యాలయాలు, ఇతర సంబంధిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ విధులను దుర్వినియోగం చేసి అక్రమంగా లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు ఏసీబీ వెల్లడించింది. ఈ కేసులో అరెస్టు చేసిన జిల్లా భూగర్భ జలాల అధికారి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని, అవసరమైతే మరిన్ని ఆధారాలు సేకరిస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా అధికారిక విధుల నిర్వహణ కోసం లంచం డిమాండ్ చేసినా లేదా స్వీకరించినా ప్రజలు వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వాట్సాప్ 9440446106, తెలంగాణ ఏసీబీ అధికారిక సామాజిక మాధ్యమాల వేదికల ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ పేర్కొంది. ప్రజలు లంచం ఇవ్వకుండా చట్టబద్ధంగా ఫిర్యాదు చేసి అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక








# చిన్నారుల రక్షణకు సమాజం ముందుకు రావాలి

- **పోక్సో చట్టంపై విస్తృత అవగాహన కల్పించిన ఎస్ఈఎస్**

**హుజూరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

బాలలపై లైంగిక వేధింపులు, దాడులు, దుర్వినియోగ ఘటనలను అరికట్టేందుకు అమలులో ఉన్న పోక్సో చట్టంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు సోషల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ (ఎస్ఈఎస్) ఆధ్వర్యంలో బుధవారం హుజూరాబాద్ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మహిళలు, యువత, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగగా, పోక్సో చట్టం గురించి ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. బాలలపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడంలో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సమాజంలోని ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలని నిర్వాహకులు సూచించారు. పిల్లల హక్కులను పరిరక్షించడం, వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎస్ఈఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ, పిల్లలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేసేలా వారికి ధైర్యం చెప్పాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను తెలుసుకోవాలని, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

పోక్సో చట్టం బాలలపై జరిగే లైంగిక నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు రూపొందించిన ప్రత్యేక చట్టమని, ఈ చట్టంపై ప్రతి కుటుంబానికి అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులపై నేరాలను పూర్తిగా నిర్మూలించేందుకు చట్టంతో పాటు సామాజిక చైతన్యం కూడా ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు.

సమాజంలో బాలల రక్షణకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, చిన్నారుల భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పోక్సో చట్టంపై గ్రామాలు, పట్టణాల్లో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచేందుకు కృషి చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఈ అవగాహన ర్యాలీలో సోషల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ సభ్యులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, పట్టణ ప్రజలు పాల్గొని చిన్నారుల రక్షణకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో బీ సి అజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్,రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్పకాయల సాగర్,కొలిపాక క్రాంతి కుమార్,పాల్గొన్నారు,

# ఆరోగ్యవంతమైన గ్రామం దిశగా బొమ్మకల్



- **జూలై 20 నుంచి బెల్ట్ షాపుల బంద్‌కు గ్రామ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం**

**సైదాపూర్ , జూలై 15(తెలంగాణ ముచ్చట్లు ):**

సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామాన్ని ఆరోగ్యవంతమైన, మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రామ పంచాయతీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ ప్రజల ఆరోగ్యం, కుటుంబాల సంక్షేమం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నెల జూలై 20, 2026 నుంచి గ్రామ పరిధిలోని బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని గ్రామ పంచాయతీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

గ్రామ సర్పంచ్ వేముల శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బెల్ట్ షాపుల వల్ల గ్రామంలో తలెత్తుతున్న సామాజిక, ఆర్థిక, ఆరోగ్య సమస్యలపై విస్తృతంగా చర్చించారు. మద్యం అక్రమ విక్రయాల కారణంగా యువత వ్యసనాలకు గురవడం, కుటుంబాల్లో కలహాలు పెరగడం, మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి అంశాలను సభ్యులు ప్రస్తావించారు. ఈ పరిస్థితులకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ వేముల శ్రీకాంత్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యం, భద్రత, కుటుంబాల ఆనందమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాల నిర్మాణం మాత్రమే కాదని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే నిర్ణయాలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ఈ నిర్ణయానికి సహకరించాలని, బెల్ట్ షాపుల నిర్వహణకు ఎవరూ అవకాశం కల్పించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, యువకులు, రైతులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్మానానికి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. గ్రామంలో బెల్ట్ షాపులు పూర్తిగా మూతపడేలా అందరూ కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి ధైర్యమైన నిర్ణయం తీసుకున్న సర్పంచ్ వేముల శ్రీకాంత్ను అభినందించారు. తమ గ్రామానికి ప్రజల ఆరోగ్యాన్ని ప్రథమ ప్రాధాన్యంగా భావించే నాయకుడు ఉండటం అదృష్టంగా భావిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. బొమ్మకల్ గ్రామ పంచాయతీ తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

జూలై 20 నుంచి ఈ తీర్మానాన్ని కట్టుదిట్టంగా అమలు చేసి, బొమ్మకల్‌ను ఆరోగ్యవంతమైన, మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పంచాయతీతో పాటు గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.





# పల్లెల అభివృద్ధినే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- **ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**
- **మధిర, ఎర్రుపాలెం మండలాల్లో రూ.60 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలు**

**ఖమ్మం బ్యూరో, జులై 15(తెలంగాణ ముచ్చట్లు )**

గ్రామాల అభివృద్ధినే లక్ష్యంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకల ఇబ్బందులను శాశ్వతంగా తొలగించే లక్ష్యంతో, మధిర మరియు ఎర్రుపాలెం మండలాల్లో ఎంపీ లాడ్స్ నిధులు రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన మొత్తం 14 సీసీ రోడ్లను ప్రారంభించారు.

**మధిర మండలం మాటూరు నుంచి ఆరంభమై ఎర్రుపాలెం రేమిడిచర్లలో ముగిసే..**

మధిర మండలం మాటూరు గ్రామం నుండి ప్రారంభమైన ఈ పర్యటన, ఎర్రుపాలెం మండలంలోని రామన్నపాలెం, ఇనగాలి, తక్కెళ్లపాడు, బనిగండ్లపాడు, మీనవోలు, ఎర్రుపాలెం మండల కేంద్రం మరియు రేమిడిచర్ల గ్రామాల్లో కొనసాగింది. వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలకు ఎంపీ శ్రీకారం చుట్టారు. తక్కెళ్ళపాడు గ్రామంలో ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నానన్నారు. నేడు ప్రారంభించిన ఈ రోడ్లు గ్రామాల్లోని ప్రజల రాకపోకలకు ఇబ్బందులను తొలగిస్తాయని చెప్పారు. ఎంపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తన పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నానని అన్నారు.

ఈ కార్యక్రమాల్లో.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మాజీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మదన్మోహన్ రెడ్డి, అంకిరెడ్డి, సర్పంచులు ముక్కరి రామకృష్ణారెడ్డి, కూరపాటి రమేష్, అప్పారావు, నంద్రు అశ్విని, బలుసుపాటి జయరావు, కొత్తపల్లి ప్రశాంత్, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సేవలు అభినందనీయం

- **– పలుస శంకర్ గౌడ్, జిల్లా సాహితీ కళా వేదిక అధ్యక్షులు**

**వనపర్తి,జూలై15(తెలంగాణ ముచ్చట్లు):**

హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణతో పాటు బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సేవలు అభినందనీయమని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక రేడియంట్ హైస్కూల్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ప్రతి సంవత్సరం నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు అందుతున్న సేవలపై సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 840కి పైగా ప్రభుత్వ ఆసుపత్రులను పరిశీలించి ఉత్తమ సేవలు అందిస్తున్న 70 ఆసుపత్రులను ఎంపిక చేయగా, వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి దేశంలో 10వ స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.జిల్లా ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ) బృందం చిత్తశుద్ధితో పనిచేస్తూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కల్పించడం వల్లే ఈ గుర్తింపు లభించిందని అన్నారు. ఎయిడ్స్ ప్రాణాంతక వ్యాధి కాదని, క్రమం తప్పకుండా మందులు వాడితే బాధితులు సాధారణ జీవితం గడపవచ్చని సూచించారు.ఈ సందర్భంగా బాధితులకు సేవలందిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్ బండారు శ్రీనివాస్‌ను సాహితీ కళా వేదిక ప్రతినిధులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కందూరు నారాయణరెడ్డి, జనజ్వాల, ఆర్డీఎస్ సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్, బైరోజు చంద్రశేఖర్, దేశి రాములు యాదవ్, డా. కంటే నిరంజనయ్య, గంధం నాగరాజు, బొజ్జిబాబు, ఎద్దుల యాదగిరి, పెరుమాళ్ల శ్రీనివాస్, కృష్ణ, శ్రీలక్ష్మి, ఉమ్మళ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్‌లో చేరిన పానుగంటి రాముకు సన్మానం

**పెద్దమందడి,జూలై15(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన పానుగంటి రాము ఇటీవల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పెద్దమందడి మండల బీఆర్ఎస్ నాయకులు పానుగంటి రామును శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన పానుగంటి రాము, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రజల్లో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకుని బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా మండల నాయకులు రవీందర్ రావు, మాజీ సర్పంచ్ వీరపాగ సత్యం, అల్వాల వెంకట్ రెడ్డి, చిక్కర్ చెట్టు తండా ఉపసర్పంచ్ రమేష్, కార్తీక్, పానుగంటి సురేష్, గోవింద్, కిషన్, మంగంపల్లి సుధీర్ తదితరులు పానుగంటి రామును శాలువాతో సన్మానించి పార్టీ తరఫున అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మదన్, సత్యనారాయణ, ధర్మశాస్త్రి, షంషుద్దీన్, భగవంతు, అంజి, విష్ణువర్ధన్ గౌడ్, చందు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పెద్దమందడిలో ముమ్మరంగా ఎస్ఐఆర్ ప్రక్రియ

**పెద్దమందడి,జూలై15(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండల కేంద్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్ రాణి ఆధ్వర్యంలో ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల నమోదును వేగవంతంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా బీఎల్ఏలుగా పురుషోత్తం రెడ్డి, మౌగులిలయ్య, మురళి గౌడ్ ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపడంలో సహకరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు జూలై 24 వరకు గడువు ఉన్నందున, గడువు ముగిసేలోపు అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. గడువులోగా ఫారాలు సమర్పించని వారి పేర్లు తుది ఓటర్ల జాబితాలో లేకపోయే అవకాశం ఉన్నందున, పెద్దమందడి గ్రామ ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# గంజాయి విక్రయాల కట్టడికి విస్తృత తనిఖీలు

- వైరా ఎస్సై రామారావు

ఖమ్మం బ్యూరో, జులై 15 (తెలంగాణ ముచ్చట్లు )

మత్తు మాఫియా కిరాణా దుకాణాలు, పాన్‌డబ్బాలు, ఆన్‌లైన్ చాక్లెట్లు, సిగరెట్లలో గంజాయి కలిపి రహస్యంగా అమ్ముతున్న నేపథ్యంలో బుధవారం వైరాలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని వివిధ ప్రాంతాల్లో గంజాయిని చాక్లెట్లు, పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారని సమాచారం మేరకు వైరా పరిసర ప్రాంతాలలో స్కూల్స్, కాలేజీలు, దుకాణాలలో గంజాయి విక్రయాలను అణచివేయడానికి పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైరాలో గంజాయి హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, పాన్‌షాపులు, కిరాణా దుకాణాలు ముసుగులో జరుగుతున్న అక్రమ అమ్మకాలను పోలీసులు పసిగట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ అక్రమ వ్యాపారంలో పట్టుబడిన వారికి పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తున్నమన్నారు.




# మాచనపల్లి పల్లె దవాఖానకు ఎన్‌క్యూఏఎస్ జాతీయ స్థాయి నాణ్యత పరిశీలన

జమ్మికుంట టౌన్ జులై 15 (తెలంగాణ ముచ్చట్లు):

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మాచనపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (పల్లె దవాఖాన) లో జాతీయ నాణ్యత సేవల మూల్యాంకనం (ఎన్‌క్యూఏఎస్) బృందం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాణ్యత ప్రమాణాలను పరిశీలించింది. ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, రోగులకు అందిస్తున్న చికిత్స, మందుల పంపిణీ, మౌలిక సదుపాయాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను బృందం సమగ్రంగా సమీక్షించింది.

ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, మాచనపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం జాతీయ స్థాయి నాణ్యత గుర్తింపు సర్టిఫికెట్ పొందే దిశగా కృషి కొనసాగుతోందన్నారు. హుజురాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని సబ్‌సెంటర్లకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. నేషనల్ టీం సభ్యులు కూడా కేంద్రంలో అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, నాణ్యత ప్రమాణాల మేరకు తుది నివేదిక ఆధారంగా జాతీయ స్థాయి గుర్తింపు సర్టిఫికెట్ మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ అసెసర్లు డాక్టర్ జయేశ్, డాక్టర్ లక్ష్మి, క్వాలిటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సనా జవేరియా, డాక్టర్ కార్తీక్, డాక్టర్ మహోన్నత్ పటేల్, సీహెచ్‌వో దిలీప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, డీపీఓ స్వామి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్, క్వాలిటీ నోడల్ అసిస్టెంట్ నాగరాజు, క్వాలిటీ యూనిట్ అఖిల్, సూపర్వైజర్ సదానందం, ఏఎన్‌ఎంలు సావిత్రి, శ్యామల, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్, కాలేజ్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలి

- ఆర్టీఓకు బీసీ అజాదీ స్టూడెంట్ ఫెడరేషన్ వినతి

హుజూరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):

హనుమకొండ జిల్లా పరిధిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుస్తున్న స్కూల్, కాలేజ్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ అజాదీ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్టీఓ)కు బుధవారం వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బీసీ అజాదీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంజాల రేవంత్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు వ్యవహరించాలని కోరారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా బస్సులు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్‌లు, కాలేజీలకు చెందిన అన్ని బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బీమా, పర్మిట్, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం, డ్రైవర్ లైసెన్స్‌తో పాటు ఇతర తప్పనిసరి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తున్న బస్సులను వెంటనే సీజ్ చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలే విద్యార్థుల ప్రాణాలను కాపాడగలవని పేర్కొన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా నిబంధనలను తప్పనిసరిగా పాటించి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో బీసీ అజాదీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కూడికల భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీనుకాల లక్ష్మణ్‌రావు, నాయకులు శివకుమార్, తిరుపతి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# పోస్టు ఖాళీ పిల్లల కష్టాలు భారీ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామ ప్రజల ఆగ్రహం

ఎల్కతుర్తి. జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు)

ఎల్కతుర్తి మండలంలోని భావుపేట గ్రామ ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఆయా పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉండటంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల సంరక్షణ, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన నిర్వహణ వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించే ఆయా లేకపోవడంతో పాఠశాల నిర్వహణపై ప్రతికూల ప్రభావం పడుతోందని వారు పేర్కొన్నారు.

ఈ పోస్టుకు గతంలో గ్రామానికి చెందిన ఒక మహిళ ఎంపికైనప్పటికీ, వ్యక్తిగత కారణాల వల్ల ఆమె విధుల్లో చేరలేదు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉండగా, కొత్త నియామకం చేపట్టకుండా అధికారులు నిబంధనల పేరుతో కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ప్రీ ప్రైమరీ స్థాయిలో చదివే చిన్నారులకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని, మరుగుదొడ్ల వినియోగం, తాగునీటి ఏర్పాటు, భోజన సమయంలో సహాయం, పరిశుభ్రత వంటి పనులకు ఆయా సేవలు అత్యంత అవసరమని తల్లిదండ్రులు తెలిపారు. ఆయా లేకపోవడంతో ఈ బాధ్యతలన్నీ ఉపాధ్యాయులపైనే పడుతున్నాయని, దీంతో బోధనకూ ఆటంకం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెబుతున్నప్పటికీ, ఇలాంటి ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని గ్రామస్తులు విమర్శించారు. చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఖాళీగా ఉన్న ఆయా పోస్టును వెంటనే భర్తీ చేయాలని, అవసరమైతే కొత్త నోటిఫికేషన్ జారీ చేసి అర్హత కలిగిన స్థానిక మహిళకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.




అలాగే, ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఇకపై కాలయాపన చేయకుండా వెంటనే నియామక ప్రక్రియ పూర్తి చేసి భావుపేట ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలలో చిన్నారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# శ్రీ చైతన్య విద్యార్థి అరుదైన విజయం

- ఏసీపీ, ఎంఈఓ చేతుల మీదుగా అభినందనలు

హుజురాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):

హుజురాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కొండ్ల అవినాష్ కరాటేలో అసాధారణ ప్రతిభ కనబర్చి గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించాడు. ఇటీవల హైదరాబాద్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచిన అవినాష్ విజయాన్ని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారులు అధికారికంగా గుర్తించి మెడల్, సర్టిఫికెట్‌ను అందజేశారు.

అవినాష్ సాధించిన ఈ అరుదైన విజయాన్ని పురస్కరించుకుని పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ ఏసీపీ మాధవి, మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మాట్ల సందీప్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, శారీరక వ్యాయామానికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొండ్ల అవినాష్ సాధించిన గిన్నిస్ రికార్డు పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం అవినాష్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని అవినాష్ విజయాన్ని అభినందించారు. ఆయన మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఇండస్ట్రియల్ ఏరియాలో ఇతర రాష్ట్రాల వ్యక్తులపై ప్రత్యేక తనిఖీలు..

- అంతర్రాష్ట్ర నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాం....
- ముదిగొండ సీఐ వడ్డేపల్లి మురళీ...

ఖమ్మం బ్యూరో, జులై 15(తెలంగాణ ముచ్చట్లు )

ఖమ్మం జిల్లా పోలీసు కమిషనర్, రూరల్ సబ్ డివిజన్ ఏసీపీ ఆదేశాల మేరకు ముదిగొండ మండలంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో బుధవారం స్థానిక సీఐ వడ్డేపల్లి మురళీ ఆధ్వర్యంలో తమ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు, ఉద్యోగులు, అనుమానితుల వివరాలను సేకరించి వారి గుర్తింపు కార్డులను పరిశీలించారు. అంతర్రాష్ట్ర నేరస్థుల కదలికలపై నిఘా ఉంచడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను నిరోధించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పోలీసులు తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల పూర్తి వివరాలు నమోదు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, ఏఎస్ఐ ఖాలిక్, హెడ్ కానిస్టేబుల్ మదార్ సాహెబ్, పోలీస్ కానిస్టేబుళ్లు శ్రీను, సాయిలు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# రాష్ట్ర భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది

- **సీఎం రేవంత్ రెడ్డి**

**కొత్తకోట,జూలై15(తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని నమ్మే వ్యక్తిని కాబట్టే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోటలో సీఎస్ఆర్ నిధులతో రూ.1.77 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కురుమూర్తి రాయ, నెల్విడి, సరళసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వహణ పనులను ప్రారంభించారు.అనంతరం పాఠశాలను సందర్శించిన ముఖ్యమంత్రి విద్యార్థులతో ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ప్రభుత్వ విద్య వెనుకబడిందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి తెలంగాణ కిట్ అందజేస్తామని, ఇందుకోసం రూ.1,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితేనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. యువతకు సాంకేతిక విద్యతో పాటు విదేశీ భాషలపై అవగాహన అవసరమని, ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి ఆధునిక విద్యావిధానాలపై శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, చదువులో వెనుకబడిన వారు క్రీడల ద్వారా అంతర్జాతీయ స్థాయికి చేరుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కొత్తకోట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు నూతన భవనం నిర్మించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.విద్యారంగానికి ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, దేవరకద్ర నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తకోట డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి విస్తరణ, మున్సిపాలిటీ అభివృద్ధి, మిషన్ భగీరథ పనులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైల్వే పట్టాలపై కేబుల్ ఆపరేటర్ మృతి..
# దర్యాప్తు చేపట్టిన జీఆర్పీ

**జమ్మికుంట టౌన్ జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**



జమ్మికుంట పట్టణంలోని ధర్మారం రైల్వే పట్టాల వద్ద మంగళవారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. జమ్మికుంట హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కేబుల్ ఆపరేటర్ దాసరి రామ్మూర్తి గౌడ్ రైలు కింద పడి మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ జి. తిరుపతి తెలిపారు. మృతుడి మరణానికి దారితీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# పోలీస్ డ్యూటీ మీట్ లో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులను అభినంధించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, జులై 15(తెలంగాణ ముచ్చట్లు )**



జులై 7 నుండి 9 వరకు వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల పరేడ్ గ్రౌండ్లో జరిగిన భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ 2026 లో వృత్తి నైపుణ్యాల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. జోనల్ స్థాయిలో కనబరిచిన ప్రతిభనే రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలన్నారు.

**పతకాలు సాధించినవారు:**

టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ వి. ఉదయ్ కుమార్, ఫోరెన్సిక్ సైన్స్, చట్టం & దర్యాప్తు రాత పరీక్షలలో రెండు బంగారు పతకాలు, వేలిముద్రల ప్రాక్టికల్ పరీక్షలో కాంస్యం పతకం సాధించారు.

కూసుమంచి ఎస్సై వి. దివ్య, వైద్యన్యాయ పరిశీలన పరీక్షలో రజిత పతకం, ఫోరెన్సిక్ సైన్స్ రాత పరీక్షలో కాంస్య పతకం సాధించారు.

ఏ ఆర్ కానిస్టేబుల్ ఎం. మహేష్, యాక్సెస్ కంట్రోల్ పరీక్షలో కాంస్యం పతకం సాధించారు.

ఏ ఆర్ కానిస్టేబుల్ పి.కిరణ్, డాగ్ స్క్వాడ్ పోటీలో కాంస్య పతకం సాధించారు.

ఈ డ్యూటీ మీట్లో జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీసులు అధికారులు కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషన్, ఫొటో, వీడియో గ్రాఫిక్ విభాగాల్లో పోటీ పడ్డారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ సాంబరాజు పాల్గొన్నారు.




# అసైన్డ్ భూములపై ఆంక్షలు తొలగించండి

- **ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ అడ్డూరి అనిల్ మాదిగ**

**ఎల్కతుర్తి, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

ఎల్కతుర్తి మండలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ అడ్డూరి అనిల్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని అసైన్డ్ భూములపై ఉన్న ఆంక్షలను వెంటనే తొలగించి, పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. పేదలకు ప్రభుత్వం కేటాయించిన భూములపై పూర్తి హక్కులు లేకపోవడం వల్ల వేలాది కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాదాపు 40 సంవత్సరాల క్రితం భూమిలేని నిరుపేదలు, ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు, గిరిజన కుటుంబాల జీవనోపాధి కోసం ప్రభుత్వం అసైన్డ్ భూములను కేటాయించిందన్నారు. అయితే ప్రస్తుతం ఆ భూములపై ఉన్న చట్టపరమైన పరిమితుల కారణంగా అత్యవసర పరిస్థితుల్లో వాటిని విక్రయించడం, బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందడం సాధ్యం కాకపోవడంతో పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వం పేదలకు ఆస్తి కల్పించాలనే లక్ష్యంతో భూములు ఇచ్చినా, పూర్తి యాజమాన్య హక్కులు లేకపోవడం వల్ల ఆ భూములను పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగిన వరంగల్ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు.

అలాగే, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను ఆదర్శంగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వం కూడా అసైన్డ్ భూములపై ఉన్న ఆంక్షలను తొలగించి, పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేలా సమగ్ర విధానాన్ని రూపొందించాలని సూచించారు.

పేదల జీవనోపాధి, ఆర్థిక స్వావలంబన, సామాజిక న్యాయం లక్ష్యంగా అసైన్డ్ భూముల పట్టాదారులకు పూర్తి హక్కులు కల్పించే నిర్ణయం తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ అడ్డూరి అనిల్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# కర్తవ్యమే లక్ష్యంగా పనిచేసిన పోలీసులకు ప్రశంసల వర్షం

- **ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలుజమ్మికుంట టౌన్ పోలీస్ సిబ్బందికి విశిష్ట గుర్తింపు**

**జమ్మికుంట టౌన్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**




కర్తవ్యమే లక్ష్యంగా భావించి ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో సేవలందించిన జమ్మికుంట టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ప్రశంసల వర్షం కురిసింది. విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, క్రమశిక్షణ, సేవాభావానికి గుర్తింపుగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చేతుల మీదుగా టౌన్ సీఐ రామకృష్ణ గౌడ్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ ఎం.డి. యాకుబ్, కానిస్టేబుళ్లు రేణుకుంట్ల జలంధర్, ఈ. రాజీవ్, సోనిలకు ఉత్తమ సేవల ప్రశంసా పత్రాలు అందజేశారు.

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సత్కారం జరిగింది. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర సేవలు అందించడంలో జమ్మికుంట టౌన్ పోలీస్ సిబ్బంది చూపిన విశిష్ట కృషిని గుర్తిస్తూ పోలీస్ కమిషనర్ ఈ ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. సేవాభావం, నిజాయితీ, కర్తవ్యనిష్ఠతో పనిచేసే పోలీసులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. జమ్మికుంట టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఇతరులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

ఒకే పోలీస్ స్టేషన్‌కు చెందిన సీఐతో పాటు హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ఒకేసారి ఈ విశిష్ట గుర్తింపును అందుకోవడం జమ్మికుంట టౌన్ పోలీస్ స్టేషన్‌కు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా సహచర పోలీసులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు వారిని అభినందించారు.

# గంజాయి రవాణా, విక్రయం,వినియోగంపై కఠిన చర్యలు

- **ఏసీపీ టాస్క్ ఫోర్స్**
- **గంజాయి తాగుతూ..పట్టుబడ్డ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్న టాస్క్ ఫోర్స్**

**ఖమ్మం బ్యూరో, జులై 15(తెలంగాణ ముచ్చట్లు )**

జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై దృష్టిసారించి రవాణా, విక్రయం, వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించడంతో మంగళవారం టాస్క్ ఫోర్స్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ గంజాయి, డ్రగ్స్ రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం సేకరించి దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకోని చట్టపరమైన చర్యల నిమిత్తం స్థానిక పోలీస్ స్టేషన్లలో అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

ఇటీవల కాలంలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట గంజాయి వినియోగిస్తూ... యువకులు పట్టుబడుతున్న నేపథ్యంలో దీనిపై పోలీస్ కమిషనర్ సీరియస్‌గా దృష్టిసారించారని, ఏజెన్సీ నుంచి నగరానికి గంజాయి దిగుమతి అవుతున్న మార్గాలతో పాటు వినియోగం ఎక్కువగా వుంటున్న ప్రాంతాలపై నిఘా వుంచాలని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో పాటు డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేకంగా నియమించిన బృందానికి పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు.

ఎవరైనా గంజాయి, మత్తుమందులతో పట్టుబడినా, వినియోగిస్తూ దొరికితే...వారిపై కేసులు నమోదుచేసి చేతులు దులిపేసుకోవడం కాకుండా వాటిని ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారు...ఎక్కడకు తీసుకువెళుతున్నారు...ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేశారనే సమాచారాన్ని సేకరించి మూలాలు వెలికితీస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నగరంలో రాత్రి ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారని మరో ఇద్దరు పారిపోయారని తెలిపారు. విచారణలో వారికి ఎక్కడి నుంచి గంజాయి వచ్చిందనే దానిపై ఆరాతీసినట్లు విచారించారు. గంజాయి సేవించిన వారితో పాటు మిగిలిన వారిపైనా పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కేసులోనూ ఇదే తరహాలో వ్యవహరించడం ద్వారా గంజాయి, డ్రగ్స్ సరఫరా చైన్‌ను బ్రేక్ చేయవచ్చని ఏసీపీ టాస్క్ ఫోర్స్ పేర్కొన్నారు. ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్నవరపేట వద్ద, ఎండు గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి, వీరిలో ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరొకరు పరారయ్యారని చెప్పారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని విచారించి, అతని వద్ద ఉన్న 40 గ్రాముల ఎండు గంజాయి ప్లాస్టిక్ సీసాలు, రోల్ పేపర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరుకూరి మామిడి తోట వద్ద, ఇద్దరు యువకులు గంజాయి తాగుతున్నట్లు గుర్తించి ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరొకరు పారిపోయారాని, 5 గ్రాముల ఎండు గంజాయి, యాక్టివా ద్విచక్ర వాహనం, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# సీమ వంటలపై సమంతకు మక్కువ

టాలీవుడ్ ప్రముఖ నటి సమంత వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకుంటున్న మార్పులు అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఒకప్పుడు వంట చేయడం పెద్దగా రాదని, ఎక్కువ సమయం చిత్రీకరణలకే కేటాయించేదానినని చెప్పిన సమంత.. ఇప్పుడు సంప్రదాయ వంటకాలపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి చెందిన సంప్రదాయ వంటకాలను నేర్చుకుంటూ, వాటి తయారీలో సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం.

సన్నిహితుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం సమంత ఇంట్లోనే ఎక్కువ సమయం గడుపుతూ రాయలసీమకు ప్రత్యేకమైన ఘాటు రుచులు, సంప్రదాయ మసాలాలతో చేసే వంటకాల తయారీని నేర్చుకుంటున్నారట. స్వయంగా వంటలు చేసి వాటి రుచిని ఆస్వాదిస్తూ, కొత్త వంటకాలపై అవగాహన పెంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు వంటగదికి దూరంగా ఉండే ఆమె ఇప్పుడు కిచెన్‌లో సమయం గడపడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఇటీవల ఆమె జీవితంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా కుటుంబంతో ఎక్కువ సమయం గడిపే అవకాశం లభించిందని, ఈ సమయంలో గతంలో నేర్చుకోలేని విషయాలపై దృష్టి సారిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బయట కార్యక్రమాలను తగ్గించి విశ్రాంతి తీసుకుంటున్న సమంత, ఆరోగ్యకరమైన ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు సమాచారం. ఇంట్లో తయారయ్యే పోషకాహారంతో కూడిన సంప్రదాయ వంటకాలనే ఎక్కువగా నేర్చుకుంటున్నారని ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు.

తెలుగు కుటుంబంలో కొత్త జీవితాన్ని ప్రారంభించిన తర్వాత తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక వంటకాలపై సమంతకు మరింత ఆసక్తి పెరిగిందని కూడా ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా రాయలసీమ వంటకాల ప్రత్యేక రుచిని ఆమె ఎంతో ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల కోసం స్వయంగా వంట చేసి వడ్డించడం ద్వారా ఆమె కొత్త అనుభూతిని ఆస్వాదిస్తున్నారని సమాచారం.

ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం' చిత్రంలో కుటుంబానికి అండగా నిలిచే ఇంటి కోడలి పాత్రలో సమంత ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అదే తరహాలో నిజ జీవితంలోనూ కుటుంబంతో ఎక్కువ సమయం గడుపుతూ, సంప్రదాయ వంటకాలను నేర్చుకోవడం ద్వారా తన జీవితంలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తున్నారని అభిమానులు చర్చించుకుంటున్నారు.





# చరణ్ సినిమాలో నయనతార..?

దక్షిణాది అగ్ర కథానాయిక నయనతార మరోసారి వార్తల్లో నిలిచారు. మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న కొత్త చిత్రంలో నయనతార కీలక పాత్రలో నటించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

దాదాపు ఇరవై రెండేళ్లుగా సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా కొనసాగుతున్న నయనతార తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కెరీర్ ప్రారంభంలో చిన్న పాత్రలు, రెండో కథానాయిక పాత్రలు చేసిన ఆమె, ఆ తర్వాత వరుస విజయాలతో అగ్రస్థానానికి చేరుకున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి, వాణిజ్య చిత్రాలతో పాటు మహిళా ప్రాధాన్య కథల్లోనూ తనదైన ముద్ర వేశారు. ప్రస్తుతం అత్యధిక పారితోషికం అందుకుంటున్న కథానాయికల్లో ఆమె ఒకరిగా కొనసాగుతున్నారు.

ఇటీవల మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న నయనతార పేరు మళ్లీ తెలుగు సినీ పరిశ్రమలో మారుమోగింది. ఈ విజయంతో ఆమెకు మరిన్ని భారీ అవకాశాలు వస్తున్నాయని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక్కో చిత్రానికి భారీ పారితోషికం అందుకుంటున్న ఆమె, తన మార్కెట్‌ను మరింత బలోపేతం చేసుకుంటున్నారు.

ఇక రామ్‌చరణ్, సుకుమార్ కలయికలో రూపొందనున్న కొత్త చిత్రంలో నయనతారకు కీలక పాత్రను ఆఫర్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కథలో అత్యంత ప్రాధాన్యం ఉన్న పాత్ర కోసం ఆమెను సంప్రదించినట్లు సమాచారం. అలాగే సినిమాలో రామ్‌చరణ్‌కు అక్క పాత్రలో ఆమె కనిపించే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందో అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే స్పష్టత రానుంది. ప్రస్తుతం ఈ ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.



# నాని సినిమా విడుదల మళ్లీ వాయిదా?

ప్రముఖ నటుడు నాని కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా నాని పోషిస్తున్న 'జడల్' పాత్రకు సంబంధించిన ప్రచార చిత్రాలు, విడుదలైన గీతం, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న తీరు సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. 'దసరా' విజయానంతరం నాని-శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న రెండో చిత్రం కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదల మరోసారి వాయిదా పడనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

మొదట ఈ చిత్రాన్ని ఈ ఏడాది మార్చిలో విడుదల చేయాలని చిత్రబృందం భావించింది. అనంతరం విడుదల తేదీని ఆగస్టు 21కు మార్చింది. అయితే ప్రస్తుతం చిత్రీకరణ పూర్తికాకపోవడం, నిర్మాణానంతర పనులు కొనసాగుతుండటం, ప్రచార కార్యక్రమాలకు మరింత సమయం అవసరం కావడం వంటి కారణాలతో విడుదలను మరోసారి వాయిదా వేసినట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ నటుడు మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేశ్‌బాబు, ఈశ్వరీరావు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ అందిస్తున్నారు.

భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార సామగ్రి మంచి స్పందన పొందడంతో సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విడుదల తేదీపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అనిల్‌పై తమ్మారెడ్డి సరదా వ్యాఖ్యలు



తెలుగు చిత్రసీమలో తన ముక్కుసూటి వ్యాఖ్యలతో ప్రత్యేక గుర్తింపు పొందిన సీనియర్ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ఎలాంటి విషయాన్నైనా నేరుగా చెప్పే స్వభావం ఉన్న ఆయన.. తాజాగా 'వదల' సినిమా విడుదలకు ముందస్తు నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు అనిల్ రావిపూడిపై చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి.

ప్రస్తుతం వరుస విజయాలతో అగ్ర వాణిజ్య దర్శకుడిగా కొనసాగుతున్న అనిల్ రావిపూడితో పని చేయాలని పలువురు అగ్ర కథానాయకులు ఆసక్తి చూపుతున్న వేళ.. ఆయనను ఉద్దేశించి తమ్మారెడ్డి చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. "అనిల్ రావిపూడి ఇప్పుడు చాలా పెద్ద దర్శకుడు అయిపోయాడు. ఈ కార్యక్రమానికి వస్తాడో లేదో అనుకున్నాను. 'గురువుగారు మీరు ఫోన్ చేయండి' అన్నాడు. కానీ నేను ఫోన్ చేస్తే ఎత్తలేదు. తర్వాత సాయంత్రం ఆయనే తిరిగి ఫోన్ చేసి మాట్లాడి కార్యక్రమానికి తప్పకుండా వస్తానని చెప్పాడు. చెప్పిన మాట నిలబెట్టుకున్నాడు" అని తమ్మారెడ్డి తెలిపారు.

అనంతరం తనపై కూడా సరదాగా వ్యాఖ్యానించిన తమ్మారెడ్డి.. "మేము కూడా ఒకప్పుడు దర్శకులుగా బిజీగా ఉన్నప్పుడు చాలామందిని ఇలాగే వేచి ఉండేలా చేసేవాళ్లం. ఫోన్లు కూడా వెంటనే ఎత్తేవాళ్లం కాదు. కాబట్టి అనిల్ అలా చేయడంలో తప్పేమీ లేదు" అని నవ్వుతూ చెప్పడంతో సభలో సందడి నెలకొంది. తమ్మారెడ్డి వ్యాఖ్యలకు అనిల్ రావిపూడి చిరునవ్వుతో స్పందించగా, అక్కడున్న సినీ ప్రముఖులు చప్పట్లతో అభినందించారు.

ఇదిలా ఉండగా, 'వదల' చిత్రంలో జగపతి బాబు, లయ మరోసారి జంటగా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. గతంలో విజయవంతమైన జోడీగా గుర్తింపు పొందిన వీరిద్దరూ చాలా కాలం తర్వాత కలిసి నటిస్తుండటంతో సినిమాపై ఆసక్తి నెలకొంది. ప్రేమ, ఉత్కంఠ ప్రధానంగా సాగే ఈ చిత్రం జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ఉద్యమకారుల సంక్షేమంపై కసరత్తు

- ఉత్తర తెలంగాణ జిల్లాలతో కమిటీ ముఖాముఖి
- వినతులపై సమగ్ర నివేదికకు సిద్ధం

**హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన ఉద్యమకారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించింది. అధికారిక షెడ్యూల్‌లో భాగంగా అమరవీరుల స్మారక చిహ్నం వద్ద జరిగిన ఈ సమావేశంలో నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, సంక్షేమ డిమాండ్లను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావుతో పాటు సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు ఉత్తర తెలంగాణ జిల్లాల ఉద్యమకారుల పాత్రను కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం సరిహద్దు జిల్లాల్లో విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు సమిష్టిగా సాగించిన ఉద్యమమే రాష్ట్ర ఆవిర్భావానికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి సేవలను ప్రభుత్వం గుర్తించే దిశగా కమిటీ పనిచేస్తోందని తెలిపారు.

ఉద్యమకారులు తమ సంక్షేమానికి సంబంధించి పలు కీలక డిమాండ్లను కమిటీ ముందు ఉంచారు. సొంత ఇల్లు లేని అర్హులైన ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలం కేటాయించాలని, వృద్ధాప్యంలో గౌరవప్రదంగా జీవించేందుకు జీవితకాల నెలవారీ పెన్షన్ అందించాలని కోరారు. అలాగే ఉద్యమకారుల పిల్లలకు విద్యా సంస్థల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక స్వయం ఉపాధి అవకాశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందేలా ప్రత్యేక ఆరోగ్య కార్డులు జారీ చేయాలని, వారి కుటుంబాలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య కల్పించాలని కోరారు. అదనంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో జీవితకాల ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కూడా డిమాండ్ చేశారు. ఈ అంశాలన్నింటినీ కమిటీ సభ్యులు నమోదు చేసుకుని పరిశీలనకు తీసుకున్నారు.

సమావేశంలో వచ్చిన ప్రతి వినతిని సానుకూలంగా పరిగణిస్తున్నామని కమిటీ సభ్యులు భరోసా ఇచ్చారు. ఉద్యమకారుల సంక్షేమం ప్రభుత్వ దయాదాక్షిణ్యానికి సంబంధించినది కాదని, తెలంగాణ సాధన కోసం చేసిన త్యాగాలకు లభించాల్సిన గౌరవమని పేర్కొన్నారు. నిజమైన ఉద్యమకారుడికి ఎలాంటి అన్యాయం జరగకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు. జూలై 22 వరకు ఉద్యమకారులతో ముఖాముఖి సమావేశాలు కొనసాగనున్నాయని కమిటీ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన అభిప్రాయాలు, వినతులు, సంక్షేమ డిమాండ్లతో సమగ్ర నివేదిక రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పిస్తామని కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు తెలిపారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన సిఫార్సులు నివేదికలో పొందుపరుస్తామని స్పష్టం చేశారు.



# సీసీఐ పునరుద్ధరణకు కేటీఆర్ కేంద్రంలో వినతి

- అదిలాబాద్ సీసీఐ పునరుద్ధరణకు కేంద్రం వద్ద కేటీఆర్ విజ్ఞప్తి
- కేంద్ర మంత్రి కుమారస్వామితో ఢిల్లీలో భేటీ
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

**న్యూఢిల్లీ, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

అదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రితో సమావేశమై సీసీఐ పునరుద్ధరణ అంశంపై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వంలోని సీసీఐ పునరుద్ధరణ సంయుక్త చర్యల కమిటీ ప్రతినిధులు, రాజ్యసభలో బీఆర్ఎస్ పక్షనేత వద్దిరాజు రవిచంద్ర కూడా పాల్గొన్నారు. అదిలాబాద్ ప్రాంత పారిశ్రామికాభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం సీసీఐ కర్మాగారాన్ని పునరుద్ధరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

సీసీఐ కర్మాగారం పునఃప్రారంభమైతే వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించడంతో పాటు అదిలాబాద్ జిల్లాలో పారిశ్రామిక కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటాయని ప్రతినిధులు వివరించారు. కర్మాగార పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ప్రతినిధుల వినతిపై కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి సానుకూలంగా స్పందించినట్లు కేటీఆర్ తెలిపారు. సీసీఐ పునరుద్ధరణ ప్రతిపాదనకు తన మద్దతు ఉంటుందని, ఈ అంశాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సహకరిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అదిలాబాద్ సీసీఐ పునరుద్ధరణ కోసం అన్ని స్థాయిల్లో కృషి కొనసాగిస్తామని, పరిశ్రమ తిరిగి ప్రారంభమయ్యేలా కేంద్రంతో సమన్వయం కొనసాగిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ చర్యతో ప్రాంత ప్రజల దీర్ఘకాలిక డిమాండ్ నెరవేరుతుందనే ఆశాభావం వ్యక్తమైంది.

# పాలమూరుకు కొత్త దశ




- పాలమూరు అభివృద్ధికి సీఎం భరోసా
- 90 టీఎంసీల నీటి అనుమతులపై ఆశాభావం
- అమర రాజా యూనిట్ ప్రారంభించిన సీఎం

**మహబూబ్‌నగర్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే శుభవార్త వినబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి అవసరమైన అనుమతులు సాధించే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న దిండి, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం పొరుగు రాష్ట్రంతో చర్చలు కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపుల అంశంపైనా సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. అన్ని అనుమతులు సాధించి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాలమూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు విద్య, నీటిపారుదల, పారిశ్రామిక రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. జిల్లాలో ట్రిపుల్ ఐటీ, ఇంజినీరింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలలు, ప్రతి నియోజకవర్గానికి నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలతో పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేలా పర్యాటకం, ఇంధనం, వైద్యం, క్రీడలకు ప్రత్యేక విధానాలు రూపొందించామని వెల్లడించారు. అమర రాజా సంస్థ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టడం అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, పరిశ్రమల్లో స్థానిక యువతకే అధిక ప్రాధాన్యంతో ఉద్యోగాలు కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. స్థానిక ప్రజల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వాహనాల బ్యాటరీల తయారీకి విశేష ప్రాధాన్యం ఏర్పడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 32 గిగావాట్ గంటల సామర్థ్యం గల యూనిట్‌ను అమర రాజా ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. సంస్థలో 700 మంది ఉద్యోగుల్లో 400 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనమని కొనియాడారు. చిత్తూరులో ప్రారంభమైన అమర రాజా సంస్థ నాలుగు దశాబ్దాల తర్వాత తెలంగాణలో భారీ పెట్టుబడులతో పరిశ్రమను ఏర్పాటు చేయడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచస్థాయి సంస్థలతో పోటీ పడుతున్న అమర రాజా చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాల కంపెనీలతో సమానంగా ఎదుగుతోందని ప్రశంసించారు. పరిశుభ్రమైన ఇంధనం, విద్యుత్ వాహనాల తయారీ రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు.






# గిడ్డంగుల సామర్థ్యం భారీగా పెంపు

- మరో 5 లక్షల టన్నుల నిల్వ లక్ష్యం
- శాస్త్రీయ గోదాముల నిర్మాణానికి ప్రాధాన్యం
- రైతులకు మెరుగైన నిల్వ సౌకర్యాలే లక్ష్యం

**హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలో రైతులకు మరింత మెరుగైన నిల్వ సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా వచ్చే రెండేళ్లలో మరో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, హాకా కార్పొరేషన్ల మేనేజింగ్ డైరెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాల వారీగా వచ్చే 20 ఏళ్ల గిడ్డంగుల అవసరాలపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఆధీనంలో 52 సొంత గిడ్డంగులు ఉండగా, వాటి మొత్తం నిల్వ సామర్థ్యం సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందన్నారు. ప్రస్తుతం 104 శాతానికి పైగా వినియోగంతో 6.33 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఈజీ, పెట్టుబడిదారుల గిడ్డంగులు, అద్దె గిడ్డంగులతో కలిపి మొత్తం 524 గిడ్డంగులను వినియోగిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా గిడ్డంగుల విస్తరణ చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 48 కొత్త గిడ్డంగుల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందని, తొలి దశలో 17 గిడ్డంగులను 2027 జనవరి నాటికి పూర్తి చేసి 2.12 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యం కల్పిస్తామని చెప్పారు. రెండో దశలో 31 గిడ్డంగులను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేసి మరో 3.66 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అదనంగా మరో 32 గిడ్డంగుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వీటితో మొత్తం రాష్ట్ర నిల్వ సామర్థ్యం సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుతుందని పేర్కొన్నారు.

కొత్తగా నిర్మించే ప్రతి గిడ్డంగిపై తప్పనిసరిగా సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. గిడ్డంగుల అవసరాలకు కావాల్సిన విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను విక్రయించి అదనపు ఆదాయం సమకూర్చుకునేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, హాకా, వేర్‌హౌసింగ్ సంస్థల ఆధీనంలోని గిడ్డంగులను ఒకే సమన్వయ వ్యవస్థ కింద నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని, దీంతో నిర్వహణ వ్యయాలు తగ్గడంతో పాటు ప్రభుత్వ వనరుల వినియోగం మరింత సమర్థవంతంగా మారుతుందని చెప్పారు.

ప్రభుత్వ కార్పొరేషన్లు ఆర్థికంగా బలోపేతం కావాలంటే వడ్డీ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు అవసరం లేని ప్రైవేటు గిడ్డంగుల అద్దెలను తగ్గించాలని మంత్రి సూచించారు. ముందుగా ప్రభుత్వ సంస్థల ఆధీనంలో ఖాళీగా ఉన్న గిడ్డంగులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అన్ని కార్పొరేషన్ల మేనేజింగ్ డైరెక్టర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కేంద్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌తో సమన్వయం పెంచి రాష్ట్రానికి లభించాల్సిన నిధులు, ఇతర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు. కొత్త గిడ్డంగుల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక ఇంజనీరింగ్ అధికారులను నియమించి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఆధునిక గిడ్డంగుల నమూనాలను అధ్యయనం చేసి, శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎక్కువకాలం మన్నికగా ఉండే నమూనాలతో నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. రైతులకు ఆధునిక నిల్వ సౌకర్యాలు కల్పించడం, ప్రభుత్వ కార్పొరేషన్లను ఆర్థికంగా బలోపేతం చేయడం, సాంకేతికతను వినియోగించి ఆదాయ వనరులను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

# మెట్రో సేవల విస్తరణకు కార్యాచరణ

- ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలపై దృష్టి
- అదనపు బోగీల ఏర్పాటుకు చర్యలు
- చివరి మైలు అనుసంధానం బలోపేతం



**హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ మెట్రో రైలు సేవలను మరింత అభివృద్ధి చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కొత్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న మెట్రో మార్గాల నిర్వహణ, అభివృద్ధిపై వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. మొదటి దశలో నిర్మించిన 69 కిలోమీటర్ల మెట్రో మార్గాల్లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, చివరి మైలు రవాణా అనుసంధానం, భద్రతా చర్యలు, పార్కింగ్ సదుపాయాలు, స్టేషన్ల పరిశుభ్రత, రద్దీ నిర్వహణ అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ప్రయాణికులు సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బోగీలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అజిత్ రెడ్డి సూచించారు. ఇందుకోసం తయారీ సంస్థలతో చర్చలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే మెట్రో స్టేషన్ల నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా చివరి మైలు రవాణా సేవలను మరింత విస్తరించాలని, రవాణా సంస్థలతో సమన్వయం పెంచాలని తెలిపారు. మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఉన్న ఆకాశ మార్గాల నిర్వహణ, విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్ల మధ్య అనుసంధాన మార్గాలను మరింత సులభతరం చేసి ప్రయాణికులు గందరగోళం లేకుండా వేదికలకు చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి మెట్రో స్టేషన్‌కు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ముందుగా కొన్ని స్టేషన్లలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని తెలిపారు.

హైటెక్ సిటీ, రాయదుర్గం, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొండాపూర్ వంటి అధిక రద్దీ ప్రాంతాల్లో ప్రజా వేగవంత రవాణా వ్యవస్థ ప్రతిపాదనల పురోగతిని కూడా సమీక్షించారు. ప్రయాణికుల భద్రత కోసం మెట్రో భద్రతా విభాగం అమలు చేస్తున్న చర్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించి, అవసరమైన మెరుగుదలలు చేపట్టాలని సూచించారు. సమీక్ష సమావేశంలో సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో పాటు వివిధ విభాగాల ప్రధాన ఇంజినీర్లు, జనరల్ మేనేజర్లు, భద్రతా విభాగ అధికారులు పాల్గొన్నారు. మెట్రో స్టేషన్ల నిర్వహణను త్వరలో క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి సేవల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటానని అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్ రెడ్డి తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎంబీబీఎస్ సీట్లు పెంపు

- వైద్య విద్యార్థులకు శుభవార్త
- దేశవ్యాప్తంగా అవకాశాల విస్తరణ

**న్యూఢిల్లీ, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

వైద్యవిద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు కేంద్రం శుభవార్త అందించింది. 202627 విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే సుమారు ఏడు శాతం అధికంగా సీట్లు అందుబాటులోకి రావడంతో వైద్య విద్యలో ప్రవేశ అవకాశాలు మరింత విస్తరించనున్నాయి. 202526 విద్యా సంవత్సరంలో దేశంలోని 818 వైద్య కళాశాలల్లో మొత్తం 1,28,976 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, 202627 విద్యా సంవత్సరానికి ఆ సంఖ్య 823 కళాశాలల్లో 1,36,939కు చేరింది. మొత్తం ఐదు కొత్త వైద్య కళాశాలలు ప్రారంభం కావడంతో పాటు 7,963 అదనపు సీట్లు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చినట్లు జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది.

ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో పెరిగిన సీట్లు

దేశంలోని 823 వైద్య కళాశాలల్లో 441 ప్రభుత్వ, 382 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మొత్తం 63,296 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, వాటిలో 61,185 సీట్లు గత ఏడాది నుంచే కొనసాగుతున్నవి. కొత్తగా 2,111 సీట్లు మంజూరయ్యాయి. ప్రైవేటు వైద్య కళాశాలల్లో మొత్తం 73,643 సీట్లు ఉండనున్నాయి. వీటిలో 65,843 సీట్లు పునరుద్ధరణ కాగా, కొత్తగా 7,800 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం ఎంబీబీఎస్ సీట్లలో 1,27,028 సీట్లు ఇప్పటికే కొనసాగుతున్నవే కాగా, కొత్తగా 9,911 సీట్లు జతయ్యాయి. దీంతో వైద్య విద్యలో ప్రవేశాలు పొందే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

కౌన్సిలింగ్‌కు ముందు కీలక ప్రకటన

202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కౌన్సిలింగ్ ప్రారంభానికి ముందే జాతీయ వైద్య కమిషన్ ఈ వివరాలను విడుదల చేసింది. అయితే ఈ జాబితాలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలు, పుదుచ్చేరిలోని జాతీయ వైద్య విద్యా సంస్థ, చండీగఢ్‌లోని వైద్య విద్యా సంస్థలకు చెందిన సీట్లు చేర్చలేదు. ఈ కేంద్ర విద్యాసంస్థల్లో ప్రతి ఏడాది సుమారు 2,900 ఎంబీబీఎస్ సీట్లకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. తాజాగా ప్రకటించిన సీట్ల పెంపుతో జాతీయ అర్హత ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. దేశంలో వైద్యుల కొరతను తగ్గించడంతో పాటు నాణ్యమైన వైద్య విద్యను మరింత విస్తరించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం, జాతీయ వైద్య కమిషన్ ఈ దిశగా చర్యలు చేపడుతున్నాయి.






# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వేకు సన్నాహాలు

- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన
- పాదచారుల భద్రతకు ప్రత్యేక చర్యలు

**హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి వాహనాల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు ప్రతిపాదించిన వన్‌వే విధానంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర సమీక్ష చేశారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు అధికారులు కేబీఆర్ పార్క్ చుట్టూ దాదాపు ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన తిరుగుతూ ప్రధాన జంక్షన్లను పరిశీలించారు. అగ్రసేన్ కూడలి, ఫిలింనగర్, జర్నలిస్టు కాలనీ, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ ప్రధాన ద్వారం తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించి, వాహనాల రాకపోకలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

హెచ్‌సిటీ ప్రాజెక్టు పనుల నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన వన్‌వే ప్రయోగాత్మక అమలులో ఎదురైన సమస్యలపై అధికారులు చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందని గుర్తించి, ఆయా ప్రాంతాల్లో వెంటనే రహదారి విస్తరణ పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. వన్‌వే అమలుకు అవసరమైన చిన్నపాటి పౌర నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని పనుల పురోగతిని సమీక్షించినట్లు తెలిపారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పాదచారుల భద్రత కోసం పెలికాన్ సిగ్నల్స్, లేన్ మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని, పార్కు అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రతిపాదించిన వన్‌వే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. నగర పోలీసు శాఖ సూచించిన పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పనులు జరిగే సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్, ట్రాఫిక్ డీసీపీ కాజల్‌తో పాటు జీహెచ్‌ఎంసీ, పోలీసు శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ట్రాఫిక్ నిర్వహణలో శాశ్వత పరిష్కారాలు అమలు చేసి నగరవాసులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# సర్ గడువు పొడిగించిన ఎన్నికల సంఘం

- ఆగస్టు 3 వరకు ఇంటింటి సర్వే
- అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా

**హైదరాబాద్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి కేంద్ర ఎన్నికల సంఘం గడువును పొడిగించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సర్వేకు అదనపు సమయం కల్పించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి దరఖాస్తుల సేకరణ ప్రక్రియను ఆగస్టు 3 వరకు కొనసాగించనున్నారు. అనంతరం ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. అర్హులైన ఓటర్ల పేర్ల నమోదు, సవరణలు, తొలగింపులకు సంబంధించిన వివరాలు ఈ జాబితాలో పొందుపరచబడతాయి.

ముసాయిదా జాబితా విడుదల అనంతరం సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఓటరు జాబితాలో పేర్లు చేర్చడం, సవరించడం లేదా తొలగింపులకు సంబంధించిన అభ్యర్థనలను ఈ గడువులోపు దాఖలు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. సెప్టెంబర్ 9 వరకు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను అక్టోబర్ 8లోగా పరిష్కరించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. సంబంధిత అధికారుల పరిశీలన అనంతరం తుది నిర్ణయాలు తీసుకుని ఓటరు జాబితాను ఖరారు చేయనుంది. పారదర్శకంగా, ఖచ్చితత్వంతో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది.

అన్ని అభ్యంతరాల పరిష్కారం అనంతరం అక్టోబర్ 12న తుది ఓటరు జాబితాను ఎన్నికల సంఘం అధికారికంగా ప్రచురించనుంది. సవరించిన షెడ్యూల్‌ను రాష్ట్ర అధికారులతో పాటు అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూసుకోవాలని, అవసరమైన సవరణలు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు. తాజా షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.




# రథయాత్ర.. భక్తి, సంప్రదాయాల మహోత్సవం



- జగన్నాథుని రథోత్సవానికి విశిష్ట స్థానం
- భక్తుల సందడితో ఆలయాలు కళకళ

**డెస్క్, జూలై 15 (తెలంగాణ ముచ్చట్లు):**

భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో రథయాత్రకు ప్రత్యేకమైన స్థానం ఉంది. భక్తి, విశ్వాసం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా భావించే ఈ ఉత్సవాన్ని దేశంలోని పలు ప్రాంతాల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా ఒడిశాలోని పూరీ జగన్నాథ ఆలయంలో జరిగే రథయాత్ర ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఇదే సందర్భంగా జూలై 16న ఒడిశా, మణిపూర్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక వేడుకలు నిర్వహించడంతో పాటు ఆయా రాష్ట్రాల్లో బ్యాంకులకు కూడా సెలవు ప్రకటించారు. రథయాత్ర సందర్భంగా జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి విగ్రహాలను అలంకరించిన భారీ రథాలపై ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్తారు. లక్షలాది మంది భక్తులు రథాల తాళ్లను లాగడం ఎంతో పుణ్యకార్యంగా భావిస్తారు. ఈ ఉత్సవాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. భక్తి భావంతో నిండిన ఈ వేడుక ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టిస్తుంది.

పూరీ రథయాత్రకు శతాబ్దాల చరిత్ర ఉంది. ఈ ఉత్సవంలో ఉపయోగించే మూడు రథాలను ప్రతి సంవత్సరం కొత్తగా ప్రత్యేక కలపతో తయారు చేయడం విశేషం. సంప్రదాయ నిబంధనలకు అనుగుణంగా రథాల నిర్మాణం చేపడతారు. రథాల ఎత్తు, చక్రాల సంఖ్య, అలంకరణ వంటి ప్రతి అంశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. వేలాది మంది శిల్పులు, కార్మికులు ఈ పనిలో పాల్గొంటారు. రథయాత్ర కేవలం మతపరమైన కార్యక్రమం మాత్రమే కాదు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా కూడా నిలుస్తుంది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, భజనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్థానిక కళలు, హస్తకళలకు కూడా ఈ ఉత్సవం ద్వారా మంచి ప్రోత్సాహం లభిస్తుంది. పర్యాటక రంగానికీ ఈ వేడుకలు ఊతమిస్తాయి.

ప్రతి సంవత్సరం రథయాత్ర సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తారు. వేలాది మంది పోలీసు సిబ్బంది, అత్యవసర సేవల బృందాలు, వైద్య సిబ్బందిని ప్రభుత్వం అందుబాటులో ఉంచుతుంది. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటారు. రథయాత్ర సందర్భంగా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు స్థానిక పరిస్థితులను బట్టి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాయి. ఒడిశా, మణిపూర్ వంటి రాష్ట్రాల్లో ఈ సందర్భంగా బ్యాంకులకు కూడా సెలవు ఉంటుంది. దీంతో వినియోగదారులు ముందుగానే తమ బ్యాంకింగ్ లావాదేవీలను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో స్థానిక ఆలయాల్లో కూడా రథోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మహానగరాల వరకు భక్తులు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొంటారు. రథాన్ని లాగడం ద్వారా దైవానుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ ఉత్సవంలో భాగస్వాములవుతుంటారు. రథయాత్ర భక్తి, సంప్రదాయం, సేవాభావం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. మత విశ్వాసంతో పాటు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే సామర్థ్యం ఈ ఉత్సవానికి ఉంది. భక్తుల మధ్య పరస్పర సహకారం, సేవా కార్యక్రమాలు ఈ వేడుకకు మరింత ప్రత్యేకతను తీసుకొస్తాయి. ఆధునిక కాలంలో కూడా రథయాత్ర వైభవం ఏమాత్రం తగ్గలేదు. ప్రత్యక్ష ప్రసారాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు ఈ ఉత్సవాన్ని వీక్షిస్తున్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు కూడా స్థానిక దేవాలయాల్లో రథయాత్రలను నిర్వహిస్తూ భారతీయ సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. రథయాత్ర మన సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా తరతరాలకు స్ఫూర్తినిస్తోంది. భక్తి భావం, సమాజంలో ఐక్యత, సేవా దృక్పథం వంటి విలువలను చాటిచెప్పే ఈ మహోత్సవం భారతీయ సంస్కృతిలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ప్రతి ఏడాది కోట్లాది మంది భక్తులను ఆధ్యాత్మిక భావనతో ఏకం చేసే ఈ ఉత్సవం దేశంలోని అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక వేడుకల్లో ఒకటిగా కొనసాగుతోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in